E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 04-08-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




ఆ 'ఎస్ఐఆర్'ను తమిళనాడుతో ముడిపెట్టడమా?: ఎన్నికల సంఘం » 2లో

# ఎన్నో లోపాలు.. ఎందరో బాధ్యులు

- » కాళేశ్వరం నివేదికపై ప్రభుత్వం దృష్టి
- » అధ్యయనం పూర్తి చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ
- » కమిటీతో సమావేశమైన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్
- » జస్టిస్ ఘోష్ నివేదిక.. అధికారుల కమిటీ సిఫార్సులపై నేడు మంత్రివర్గ సమావేశం
- » తదుపరి చర్యలకు సీఐడీకి బాధ్యతలు?



ఈ కబురు, హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతోంది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అనేక లోపాలు, అక్రమాలు జరిగినట్లు తెలపడమే కాక ఏ వైఫల్యానికి ఎవరు బాధ్యులో కూడా కమిషన్ పేర్కొంది. న్యాయ విచారణ కమిషన్‌లు నివేదికలు ఇచ్చినపుడు గతంలో ఏ రాష్ట్రంలో ఎలా చేశారు? తదుపరి కార్యచరణ ఏమిటన్న దానిపై మంత్రుల్లో ఇప్పటికే చర్చ జరుగుతున్నా.. సోమవారం మధ్యాహ్నం నిర్వహించే మంత్రివర్గ అత్యవసర సమావేశం జస్టిస్ ఘోష్ నివేదికపై సమగ్రంగా చర్చించనుంది. నివేదికను పరిశీలించి ముఖ్యమైన సిఫార్సులను మంత్రివర్గం ముందు ఉంచడానికి సీఎం రేవంత్‌రెడ్డి ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

తరువాయి 2లో



## రాష్ట్రపతిని వేర్వేరుగా కలిసిన మోదీ, అమిత్‌షా


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధానమంత్రి ఆదివారం సమావేశమైనట్టు రాష్ట్రపతి భవన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. ఆ తర్వాత కొద్ది గంటలకు మళ్లీ రాష్ట్రపతి భవన్ మరో ట్వీట్‌లో హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రపతిని కలుసుకున్నట్టు వెల్లడించింది.

తరువాయి 2లో

రూ.32,000 కోట్ల పెట్టుబడి.. 14,500 కొత్త పడకలు » 4లో



ఎందరో తల్లులు ఫోన్ చేసి అలా చెబుతుంటే.. » 5లో



లక్కీ ఛాన్స్ కొట్టేసిన జీవీ » 5లో ప్రకాశ్ సోదరి?



చరిత్ర సృష్టించిన భారత్ ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ » 6లో



## ఒక్క నెలలోనే 6,000 పైగా డ్రోన్లతో దాడులు.. విరుచుకుపడుతున్న రష్యా!

» 2లో



## కాంగ్రెస్, బీజేపీల ఏకైక ఎజెండా బీఆర్ఎస్ ను ఓడించడమే : కేటీఆర్



ఈ కబురు : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి సునీత గోపినాథ్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ లో ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం , యూసఫ్ గూడా డివిజన్ బూత్ స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ....మాగంటి గోపీనాథ్

తరువాయి 2లో

## ఉద్దండాపుర్ భూనిర్వాసితులకు అండగా నిలిచాం: సీఎం రేవంత్‌రెడ్డి

- » పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉద్దండాపుర్ రిజర్వాయర్ భూనిర్వాసితులకు అండగా నిలిచామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.
- » ఉద్దండాపుర్ భూనిర్వాసితులకు అండగా నిలిచాం: సీఎం రేవంత్‌రెడ్డి

తరువాయి 2లో



## కేసీఆర్, హరీష్ రావు, ఈటలకు ఊహించని?



ఈ కబురు,కాళేశ్వరం నివేదికపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సచివాలయంలో జరిపిన కీలక సమావేశం ముగిసింది. కాగా ఇటీవలే కాళేశ్వరం కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసిన విషయం తెలిసిందే. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిఈ నివేదికను అధ్యయనం చేయడానికి ఉన్నతాధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేసారు. ఈ కమిటీ సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలో నీటిపారుదల శాఖకు చెందిన అధికారులు సభ్యులుగా ఉన్నారు. అయితే రేపు తెలంగాణ కేబినెట్ సమావేశంఅయ్యి కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఓ నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో సీఎస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో కమిషన్ ప్రభుత్వానికి పలు ముఖ్య సూచనలు చేసినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం బాధ్యులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు అక్రమాలలో కేసీఆర్, హరీష్ రావు, ఈటెల రాజేందర్ ల పాత్రపై ఉన్నట్టు తెలిపింది.

తరువాయి2లో



## నాపై అనుచిత వ్యాఖ్యల వెనక పెద్ద నాయకుడు!

» 3లో



## పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

» 3లో

## ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధారామం..

» 3లో



మొదటి పేజీ తరువాయి

# ఎన్నో లోపాలు.. ఎందరో బాధ్యులు



మంత్రివర్గ సమావేశం అనంతరం కీలక నిర్ణయం ఆర్థిక అవకతవకలు, నిబంధనలకు తూట్లు పొడవడంతో పాటు నిర్మాణ సంస్థతో ప్రాజెక్టు అధికారులు కుమ్మక్కయ్యారని..మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో భారీగా ప్రజాధనం దుర్వినియోగమైందని చెబుతూ ఇందులో ఎవరెవరి పాత్ర ఏమిటో న్యాయ కమిషన్ వివరంగా పేర్కొన్నట్లు తెలిసింది.

గత ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తో పాటు ఐఏఎస్ అధికారులు, సీనియర్ ఇంజినీర్లు ఇలా అనేక మంది పాత్ర గురించి కమిషన్ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తున్న నేపథ్యంలో మంత్రివర్గం తీసుకొనే నిర్ణయాలు..తదుపరి కార్యాచరణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాలన్నది ప్రభుత్వ నిర్ణయం కాదని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు వ్యక్తిగతంగా తీసుకొన్నట్లు పేర్కొనడంతో పాటు బ్యారేజీలు దెబ్బతినడానికి నాటి నిర్ణయాలే కారణమని జస్టిస్ ఘోష్ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

మంత్రివర్గ అనుమతి లేకపోవడం, తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని బ్యారేజీల నిర్మాణ స్థలాన్ని మార్చడం, అంచనాల సవరింపులో అవకతవకలు, నిర్వహణ సరిగా లేకపోవడం, నీటిని మళ్లించడానికి నిర్మించిన బ్యారేజీలలో నీటిని నిత్యం నిల్వ ఉంచడం, నిపుణుల కమిటీ నివేదికను పక్కనపెట్టడం, డిజైన్లలో లోపాలు, నాణ్యతా తనిఖీలు లేకపోవడం, పని పూర్తికాకుండానే పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇవ్వడం ఇలా అనేక అంశాలను కమిషన్ ప్రస్తావించినట్లు తెలిసింది.

ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకొన్నారని అప్పటి ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌ను కూడా కమిషన్ తప్పు పట్టినట్లు సమాచారం. వీరితో పాటు మాజీ ప్రధాన కార్యదర్శి, కాళేశ్వరం నిర్మాణ సమయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్.కె.జోషి, ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా ఉంటూ ప్రాజెక్టును పర్యవేక్షించిన స్మితాసభర్వాల్‌తో పాటు మాజీ ఈఎన్సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, నాగేందర్‌రావు, నరేందర్‌రెడ్డి, మాజీ సీఈలు చంద్రశేఖర్, బసవరాజు.. ఈఎన్సీలు టి.శ్రీనివాస్, హరిరాం, సీఈలు సుధాకర్‌రెడ్డి, ప్రమీల తదితరుల పాత్ర గురించి వెల్లడించినట్లు తెలిసింది.

వాప్కోస్ సంస్థకు డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ కింద ఇచ్చిన రూ.6.77 కోట్లను తిరిగి వసూలు చేయాలని కూడా కమిషన్ సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో తీసుకొనే నిర్ణయం కీలకం కానుంది. తదుపరి చర్యలకు సీఐడీకి ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతుంది.

కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కె.ఐ.పి.సి.ఎల్) ద్వారా ఆర్థిక అవకతవకలు జరిగాయని పేర్కొన్న న్యాయ కమిషన్.. దీనికి బోర్డు సభ్యులు బాధ్యులని.. బోర్డులో ఉన్న నీటిపారుదల, ఆర్థికశాఖ అధికారులపై క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ కింద చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.

కార్పొరేషన్ ఎండీగా ఉంటూ కేంద్ర జల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారని, బ్యారేజీల గురించి తనకు ఏమీ తెలియదని చెప్పారంటూ కాళేశ్వరం మాజీ ఈఎన్సీ హరిరాం గురించి కమిషన్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

**నిర్మాణ, పునరుద్ధరణ పనులు ఎల్ అండ్ టీ చేపట్టేనా?**

మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాకును పూర్తిగా తొలగించి మళ్లీ నిర్మించడంతో పాటు మిగిలిన బ్లాకుల పరిస్థితిని పరిశీలించేందుకు అవసరమైన పరీక్షలు చేయించాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫార్సు చేసింది. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ పి.ఇ.ఎస్ జాయింట్ వెంచర్‌పై క్రిమినల్ చర్యలతో పాటు పునరుద్ధరణ పనులకయ్యే మొత్తాన్ని వసూలు చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫార్సు చేసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగినపుడు పునరుద్ధరణకయ్యే ఖర్చును తామే భరిస్తామని ప్రకటించిన నిర్మాణ సంస్థ తర్వాత ..తమకు సంబంధం లేదని పేర్కొంది. ఇప్పుడు కమిషన్ కూడా ఎల్ అండ్ టీని తప్పు పట్టింది. ఈ పనికి సంబంధించి ఎలాంటి సర్టిఫికెట్లు ఇవ్వరాదని, ఏడో బ్లాకును పునరుద్ధరించడంతో పాటు మిగిలిన లోపాలు సవరించడానికయ్యే వ్యయాన్ని కూడా సొంతంగా భరించాలని సిఫార్సు చేసింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో వచ్చే లోపాలను సరిదిద్దే బాధ్యత నిర్మాణ సంస్థలదేనని.. అన్నారం, సుందిళ్లలో కూడా నిర్మాణ సంస్థలు ఈ పని చేయాలని పేర్కొంది. అయితే గత ఆరునెలలుగా పునరుద్ధరణ, మరమ్మతులకయ్యే వ్యయంతో తమకు సంబంధం లేదని నీటిపారుదల శాఖకు పదే పదే లేఖలు రాసిన ఎల్ అండ్ టీ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సిఫార్సుతో ముందుకు వస్తుందా, రాకపోతే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

మొదటి పేజీ తరువాయి

# రాష్ట్రపతిని వేర్వేరుగా కలిసిన మోదీ, అమిత్‌షా



ఈ కబురు,న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఒకరి తర్వాత మరొకరు రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం నాడు సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్ వర్గాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. అయితే, అగ్రనేతలిద్దరూ రాష్ట్రపతితో సమావేశం కావడానికి కారణమేమిటనేది తెలియలేదు. పీఎంవో కానీ, హోం శాఖ కార్యాలయం నుంచి గానీ ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధానమంత్రి ఆదివారం సమావేశమైనట్టు రాష్ట్రపతి భవన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. ఆ తర్వాత కొద్ది గంటలకే మళ్లీ రాష్ట్రపతి భవన్ మరో ట్వీట్‌లో హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రపతిని కలుసుకున్నట్టు వెల్లడించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల యూకే, మాల్దీవుల్లో పర్యటనకు వెళ్లి వచ్చిన అనంతరం రాష్ట్రపతితో సమావేశం కావడం ఇదే మొదటిసారి. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై చర్చకు విపక్షాలు పట్టుబడుతుడటం, దీంతో పార్లమెంటు సమావేశాల్లో ప్రతిష్ఠంభన తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రపతిని ప్రధాని, హోంమంత్రి కలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌పై ఉభయసభల్లోనూ చర్చ జరగ్గా, ఆగస్టు 12వ తేదీతో వర్షాకాల సమావేశాలు ముగియనున్నాయి.

# ఉద్దండాపుర్ భూనిర్వాసితులకు అండగా నిలిచాం: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఈ కబురు: పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉద్దండాపుర్ రిజర్వాయర్ భూనిర్వాసితులకు అండగా నిలిచామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వస్తే పరిహారం ఇచ్చి బాధితుల కన్నీళ్లు తుడుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఏడాదిన్నర కాలంలో 250 కోట్ల రూపాయల పరిహారం మంజూరు చేశామన్నారు.గత నెలలో 25 కోట్లు విడుదల చేయగా, ఈ నెలలో మరో 175 కోట్ల రూపాయలు విడుదల చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వాసితులతో సహపంక్తి భోజనం చేసి డిసెంబరు 9 లోపు పూర్తి పరిహారం అందిస్తామని తన మాటగా చెప్పాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సూచించానన్నారు. తన ఆదేశాల మేరకు 6 వేల మందితో సహపంక్తిభోజన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు**

మొదటి పేజీ తరువాయి

# కాంగ్రెస్, బీజేపీల ఏకైక ఎజెండా బీఆర్ఎస్ ను ఓడించడమే :



ఈ కబురు : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి సునీత గోపినాథ్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ లో ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం , యూసఫ్ గూడా డివిజన్ బూత్ స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ....మాగంటి గోపీనాథ్ చేసిన సేవలకు నివాళిగా, మరొక్కసారి జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగరవేద్దాం అని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వంటి నేతలంతా వచ్చి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు అని అన్నారు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారు అని తెలిపారు.కాంగ్రెస్, బీజేపీల ఏకైక ఎజెండా తెలంగాణ రాష్ట్ర సమితిని ఓడించడమే అని కేటీఆర్ అన్నారు. అందుకే ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణలో కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నారు అని తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలనీ, రేవంత్ రెడ్డి అసమర్థ పాలనతో విసిగిపోయిన అన్ని వర్గాలను కలుపుకుని, రాబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కేటీఆర్ జూబ్లీహిల్స్ ముఖ్య కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ హోమ్ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ , రావుల శ్రీధర్ రెడ్డి, షైక్ అబ్దుల్లా సోహైల్, ఆజం అలీఖాన్, యూసుఫ్ గూడా డివిజన్ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వెంగల్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యారావు, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్ యూసఫ్ గూడా డివిజన్ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆ 'ఎస్ఐఆర్'ను తమిళనాడుతో ముడిపెట్టడమా?: ఎన్నికల సంఘం

ఈ కబురు: బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ను తమిళనాడుతో ముడిపెట్టడం అసంబద్ధమని పేర్కొంది. తమిళనాడులో ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ఇంకా నిర్వహించలేదని గుర్తుచేసింది.'ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో మాత్రం 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది' అని పి.చిదంబరం ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి శాశ్వతంగా వలస వెళ్లారనే కారణంతో బిహార్‌లోని లక్షలాది మంది ఓటర్లను తొలగించాలని ఎన్నికల సంఘం ఎలా నిర్ధరణకు వచ్చిందని ప్రశ్నించారు. ఈసీ తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు.చిదంబరం వ్యాఖ్యలను నిరాధారమైనవిగా, తప్పుదోవ పట్టించేవిగా పేర్కొంటూ ఎన్నికల సంఘం ఖండించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 19(బీ) ప్రకారం.. ఒక నియోజకవర్గంలో నివసిస్తున్న వ్యక్తి స్థానిక ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి దిల్లీలో నివసిస్తున్నట్లయితే.. దిల్లీలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. అలాగే బిహార్‌కు చెందిన వ్యక్తి చెన్నైలో ఉంటే.. అదే విధానం వర్తిస్తుందని తెలిపింది.ఈ నేపథ్యంలో.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నేతలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం తగదని ఈసీ పేర్కొంది. ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. అదేవిధంగా.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్ల నమోదు గురించి తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పింది. ఆ రాష్ట్రంలో ఇంకా ఓటర్ల జాబితా సవరణ చేపట్టలేదని.. కాబట్టి బిహార్‌లోని ఎస్ఆఐర్ ప్రక్రియతో ముడిపెట్టడం అసంబద్ధమని స్పష్టం చేసింది.

# ఒక్క నెలలోనే 6,000 పైగా డ్రోన్లతో దాడులు.. విరుచుకుపడుతున్న రష్యా!

మొదటి పేజీ తరువాయి

ఈ కబురు: ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌పై రష్యా తన దాడులను తీవ్రతరం చేసింది. గత నెలలో ఏకంగా ఆరు వేలకు పైగా డ్రోన్లు ప్రయోగించినట్లు తెలుస్తోంది. 2022లో యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి ఒక నెలలో ఈ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టడం ఇదే మొదటిసారని ఓ అంతర్జాతీయ వార్తాసంస్థ పేర్కొంది. ఈ దాడుల్లో ఉక్రెయిన్‌లో పదుల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయయని, పెద్దఎత్తున ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపింది.ఉక్రెయిన్ వైమానిక దళం వివరాల ప్రకారం.. మాస్కో సేనలు గత నెలలో 6,297 దీర్ఘశ్రేణి డ్రోన్లను ప్రయోగించాయి. జూన్‌తో పోలిస్తే దాదాపు 16 శాతం ఎక్కువ. గత ఏడాది జులైతో పోలిస్తే ఈ ఏడాది జులైలో 14 రెట్లు ఎక్కువ డ్రోన్లు ప్రయోగించినట్లు మరో నివేదిక తెలిపింది. ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, వాస్తవ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని ఉక్రెయిన్ వైమానిక దళ ప్రతినిధి యూరి ఇహ్నాత్ తెలిపారు.



గత నెల 9న ఒక్క రాత్రిలోనే రష్యన్ బలగాలు రికార్డు స్థాయిలో 728 డ్రోన్లు, 13 క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఉక్రెయిన్‌లోని సుమీ, దొనెట్స్క్, ఖేర్సన్ రీజియన్‌లలో ఎనిమిది మంది మరణించారు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు ఇవ్వాల్సి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజే ఈ భీకర దాడులు చేపట్టింది. జులై 31న కీవ్‌పై జరిపిన దాడిలో ఐదుగురు చిన్నారులు సహా 31 మంది మృతి చెందారు. మరో 159 మంది గాయపడ్డారు.

# నాపై అనుచిత వ్యాఖ్యల వెనక పెద్ద నాయకుడు!



ఈ కబురు,హైదరాబాద్: బీఆర్ఎస్‌లోని పెద్ద నాయకుల తీరుపై కొన్ని నెలలుగా అసంతృప్తి వ్యక్తంచేస్తూ వస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరుగా పేర్లు ప్రస్తావించకుండా.. పరోక్షంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిలను ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఓ పెద్ద నాయకుడు ఇంటి ఆడబిడ్డనని కూడా చూడకుండా తనపై నీచంగా, అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. పెద్ద నాయకుడి అండతో సొంత పార్టీ నేతలే తనను ఇబ్బంది పెడుతున్నారని.. ఇవన్నీ ఆషామాషీగా చెప్పడం లేదని, ఆవేదనతో చెబుతున్నానని పేర్కొన్నారు. ఆ పెద్ద నాయకుడు తనపై చేస్తున్న కుట్రలు తిరిగి ఆయనకే తగులుతాయని వ్యాఖ్యానించారు. తన దగ్గర ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు మనుషులను పెట్టారన్నారు. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని నాశనం చేసిన ఓ లిల్లీపుట్ నాయకుడు తన గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల జగదీశ్‌రెడ్డి ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవితను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందిస్తూ కవిత ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో సంచలనం రేపుతున్నాయి. మీడియా సమావేశంలో కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె మాటల్లోనే.. ''ఇగ ఏం జెప్పాలన్నా.. నా బాధ.. కొందరు నాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. ఒక ఆడబిడ్డగా భావించి యావత్ తెలంగాణ బాధపడింది.అనేకమంది ఎక్కడికక్కడ స్పందించారు. ఏమైందో ఏమోగానీ.. బీఆర్ఎస్ పార్టీలోని అన్నదమ్ములు మాత్రం స్పందించలేదు. దీని వెనుక బీఆర్ఎస్‌కు చెందిన పెద్ద నాయకుడు ఒకరి హస్తం ఉంది. అందుకే పార్టీ నాయకులెవరూ స్పందించలేదని బలంగా నమ్ముతున్నాను. ఆ కుట్రలు చేసిన పెద్ద నాయకులు నా దగ్గర ఒక పది మందిని పెట్టి.. నా చుట్టూ జరిగే అంశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ చావుతెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. కానీ, బాగా పెద్దగా ఉన్న నాయకుడికి అర్థం కావాల్సింది ఏమంటే.. అక్కడేం జరుగుతుందో కూడా నాకు సమాచారం వస్తూనే ఉంటుంది. మీరు ఏ సమయంలో ఎవరిని కలిశారు. నామీద వ్యాఖ్యలు చేయడానికి ఎవరిని ప్రోత్సహించారు? మీరు ఎంత కిందకు దిగజారి ఒక ఆడబిడ్డ మీద అటువంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు.. అన్నీ నేను గమనిస్తూనే ఉన్నాను. ఇవాళ మీరు తాత్కాలికంగా శునకానందం పొందొచ్చు. కానీ దేవుడున్నాడు. కచ్చితంగా అది మీకు తిరిగికొట్టే సమయం వస్తుంది. ఇగ రెండోది.. ఒక లిల్లీపుట్ నాయకుడు. నల్గొండలో బీఆర్ఎస్‌ను నాశనం చేసిన ఆ లిల్లీపుట్ నాయకుడు.. ఆమెవరు, ఈమెవరు..? అని నా గురించి మాట్లాడుతున్నారంటే.. ఆయనకు ప్రోత్సాహం ఇస్తున్నదెవరో ప్రజలు ఆలోచించాలి. ఎన్నడూ ప్రజాఉద్యమాలు చేయలేదాయన.. కేసీఆరే లేకపోతే.. ఆయనెవరు? ఈ లిల్లీపుట్ నాయకుడు మాట్లాడగానే.. ఇంకో చిన్నపిల్లగాడు, నిన్నమొన్ననే మా పార్టీలోకి వచ్చినవాళ్లు కూడా ఎలాపడితే అలా మాట్లాడుతున్నారు. చిన్న పిలగాడివి..చిన్నపిలగాడిలా ఉండుబాబూ.. (కవితపై వ్యాఖ్యలు చేసిన కార్తీక్‌రెడ్డిని ఉద్దేశిస్తూ..). పెద్దవాళ్ల విషయాల్లో తలదూర్చకు. నీ వెనకాల చాలా మంది ఉన్నారని అనుకుంటున్నావేమో? వాళ్ల సంగతికూడా ప్రజల్లోకి వస్తది. సీఎం రమేశ్ ఎందుకు వ్యాఖ్యలుచేశారో నాకు తెలియదు. ఆయన వ్యాఖ్యల వెనుక నేను కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అవడానికి సంబంధం ఉందనుకుంటున్నాను. నాకు ఎవరి సపోర్ట్ లేదు. మ్యాచ్ ఫిక్సింగ్ నాకు రాదు.. ఆ అలవాటు వాళ్లకేఉంది. ఆవేదనతో చెబుతున్నా.. రాజకీయం చేయొచ్చుగానీ.. నీచంగా ఒక ఇంటి ఆడబిడ్డమీద ఇటువంటి మాటలు మీరే అనిపించడం ఏమిటి?'' అని కవిత నిలదీశారు.

బీసీ రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సోమవారం నుంచి 72 గంటలపాటు నిరాహారదీక్ష కొనసాగిస్తానని కవిత తెలిపారు. కొంత సమయమే దీక్ష చేపట్టాలని ప్రభుత్వం సూచించిందని చెప్పారు. కానీ బీసీల్లోని 112 కులాలకు సంబంధించిన సమస్యలు చెప్పుకోవాలంటే.. రోజుకు 40 కులాల ప్రతినిధులు మాట్లాడాల్సి ఉంటుందని, ఇందుకు మూడు రోజుల సమయం పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆంక్షల్లేకుండా అనుమతించాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

# కేసీఆర్, హరీష్ రావు, ఈటలకు ఉచ్చు బిగించనున్నారా?

అయితే రేపు తెలంగాణ కేబినెట్ సమావేశంఅయ్యి కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఓ నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో సీఎస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో కమిషన్ ప్రభుత్వానికి పలు ముఖ్య సూచనలు చేసినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం బాధ్యులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు అక్రమాలలో కేసీఆర్, హరీష్ రావు, ఈటెల రాజేందర్ ల పాత్రపై ఉన్నట్టు తెలిపింది.కేసీఆర్, హరీష్ రావు ఆదేశాలతోనే ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్టు కమిషన్ గుర్తించింది. ఇరిగేషన్ శాఖ పంపిన నివేదికలను పరిశీలించకుండానే ఆర్థికశాఖ గుడ్డిగా ఆమోదం తెలిపిందని కమిషన్ పేర్కొంది. నీటిపారుదలశాఖ, ఆర్థికశాఖలో భారీగా లోపాలు ఉన్నట్టు కూడా గుర్తించింది. పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ రేపు బ్రీఫ్ రిపోర్ట్ ఇవ్వనుండగా.. కేబినెట్లో చర్చించిన అనంతరం నివేదికను తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నట్టు తెలుస్తోంది.





మొదటి పేజీ తరువాయి

# బోనమెత్తిన గోపనపల్లి...


గంగాధర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్



అమ్మవారి పూజలో పాల్గొన్న రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి తదితరులు


బోనాలతో ఊరేగింపుగా తరలివస్తున్న మహిళలు

**కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా చిత్తారమ్మ బోనాలు హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి ఆదివారం బోనమెత్తింది. గ్రామంలోని మహిళలంతా తరలివచ్చి చిత్తారమ్మ తల్లికి బోనం సమర్పించగా, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పులతో గోపనపల్లి మారుమ్రోగింది. గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గోపనపల్లి గ్రామంలో శ్రీశ్రీ చిత్తారమ్మ తల్లి శ్రావణమాస బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవాలకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి ఇంఛార్జి రవికుమార్ యాదవ్, ఎంబీసీ ఛైర్మన్ జెరిపేటి జైపాల్, సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి దంపతులు మొదటి పూజలు నిర్వహించాగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేడుకలకు హాజరైన దాదాపు మూడు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ శ్రావణ మాసంలో బోనాల పండుగను తెలంగాణ ప్రజలు ఎంతో భక్తితో నిర్వహిస్తారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక ప్రతీక అని, అమ్మవారి దీవెనల కోసం బోనమెత్తే ప్రతి ఆడబిడ్డ హిందూ సంస్కృతికి నిజమైన వారసురాలని అన్నారు. చిత్తారమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని సీనియర్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవాలయ కమిటీ సభ్యులు ,భక్తులు పాల్గొన్నారు.

# టాలీవుడ్ కొరియోగ్రాఫర్ మీద ఫోక్సో కేసు




## రిమాండ్ కు తరలించిన పోలీసులు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : మరో టాలీవుడ్ కొరియోగ్రాఫర్ లైంగిక వేధింపుల కేసులో అరెస్టు అయ్యాడు. ఢీ షోలో డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ క్రిష్ణ మాస్టర్ మీద ఫోక్సో కేసు నమోదు కాగా గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కుబుంబ కలహాలతో మొదటి భర్తతో విడిపోయిన ఓ మహిళను ఢీ షోలో డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ రాధాక్రిష్ణ గత సంవత్సరం క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. కాగా సదరు మహిళకు 10వ తరగతి చదువుతున్న కుమార్తె ఉండగా, కుమార్తెతో కలిసి ఇద్దరు నివాసం ఉంటున్నారు. కాగా కొంత కాలంగా క్రిష్ణ మాస్టర్ తన మైనర్ కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో సదరు మహిళ జూలై 9వ తేదీన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసింది. ఈ పిర్యాదుపై ఫోక్సో కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు క్రిష్ణ కోసం గాలింపు చేపట్టారు. బెంగళూరులోని తన అన్న వద్ద ఉంటున్న క్రిష్ణను అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులు కంది జైలుకు తరలించారు. కాగా గతంలో సోషల్ మీడియాతో పలువురు యువతులు, మహిళలను మోసం చేసినట్లు క్రిష్ణపై ఆరోపణలు ఉన్నాయి.

## భారత ప్రభుత్వం ఎన్నటికీ మన దేశ పౌరుల కోసమే పనిచేస్తుంది:

# మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



కార్యక్రమంలో సైనిక అధికారులను సన్మానిస్తున్న దృశ్యం


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

- భారత సాంకేతిక నైపుణ్యం ప్రపంచానికి తెలిసింది: డాక్టర్ సతీష్ రెడ్డి

**ఎస్కీలో భారత సైనికులకు, పెహల్గామ్ మృతులకు ఘన నివాళి**

ఈకబురు, శేరిలింగంపల్లి : భారతదేశ ప్రభుత్వం ఎప్పటికీ మన దేశ పౌరుల కోసమే పనిచేస్తుందని, ఇతర దేశాల ఒత్తిడికి తలొగ్గదని మాజీ ఉప రాష్ట్ర పతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఎవరి పని వాళ్లు చేస్తే అదే దేశభక్తి అవుతుందని తెలిపారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) లో ఆదివారం 'సెల్యూటింగ్ అవర్ హీరోస్ ఆపరేషన్ సిందూర్' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ లో భారత సైనికుల ధైర్యానికి, దేశభక్తికి గుర్తుగా అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్(ఎబిఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, డిఆర్డిఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. అనంతరం వెంకయ్యానాయుడు మాట్లాడుతూ కులాన్ని, మతాన్ని, వర్గాన్ని ఉపయోగించి కొన్ని సంస్థలు దేశంలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. భారతదేశానికి ఈ దుష్టశక్తులపై పోరాడే సామర్థ్యం ఉందని, నీరు, నింగి, నేల ప్రతిదానికి శక్తి ఉందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్, మహాదేవ్ ఆపరేషన్లలో పాల్గొన్న సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. కేవలం 22 నిమిషాల్లోనే లక్ష్యాలను చేదించడం, ఆపరేషన్ సింధూర్, మహాదేవ్ ఆపరేషన్లను విజయవంతంగా ముగించడం అద్భుతమన్నారు. ఎబిఆర్ఎస్ఎం టీచర్స్ యూనియన్ అయినా.. దేశం కోసం కృషి చేయడం అభినందనీయమని అన్నారు. పెహల్గాంలో ఉగ్రదాడికి బదులుగా ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా చేపట్టిన భారత్ సరికొత్త చరిత్రను సృష్టించిందని తెలిపారు. మహాదేవ్ ఆపరేషన్ చేపట్టి పెహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టారని అన్నారు. అపరేషన్ సింధూర్ కేవలం ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టడం కాదని, సాధారణ ప్రజలకు ప్రమాదం లేకుండా ఆపరేషన్ నిర్వహించడం మన త్రివిధ దళాల ప్రతిభకు నిదర్శనమన్నారు. కేవలం మూడు దేశాలు మినహా ప్రపంచ దేశాలు మొత్తం భారత్ కు మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. భారతదేశం కేవలం ఆత్మరక్షణ కోసం మాత్రమే దాడులు చేస్తుందన్నారు. డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ అపరేషన్ సింధూర్ తో భారత సాంకేతిక పైపూణ్యం ప్రపంచానికి తెలిసిందన్నారు. భారతదేశంలో అభివృద్ధి చేసిన డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్ఫేర్, అడ్వాన్స్డ్ ఎయిర్ డిఫెన్స్ టెక్నాలజీలు అపరేషన్ సిందూర్ లో అద్భుతంగా పనిచేశాయని అన్నారు. భారత సైన్యంలోని మూడు విభాగాలు ఆర్మీ. నేవి. ఎయిర్ ఫోర్సులు సమన్వయంతో పని చేశాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగరం

మొదటి పేజీ తరువాయి

# సర్కారు నిర్ణయాలపై ఏం చేద్దాం..?

కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలపై సర్కారు క్రిమినల్ చర్యలు చేపట్టే అవకాశముందన్న ప్రచారం నేపథ్యంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్‌తో ముఖ్య నేతలు భేటీ అయ్యారు.



**ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ**

**కాళేశ్వరం కమిషన్ నివేదికపై ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్న దానిపై చర్చ**

**కవిత వ్యవహారం, బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమాలోచనలు**

నేడు కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్లనున్న బీఆర్ఎస్ నేతలు

ఈ కబురు,హైదరాబాద్/గజ్వేల్/ మహదేవపూర్: కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలపై సర్కారు క్రిమినల్ చర్యలు చేపట్టే అవకాశముందన్న ప్రచారం నేపథ్యంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్‌తో ముఖ్య నేతలు భేటీ అయ్యారు. ఆదివారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను మాజీమంత్రులు తన్నీరు హరీశ్‌రావుతో పాటు పలువురు నేతలు కలిసినట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ తన నివేదికలో పేర్కొన్న అంశాలేంటి? దాని ఆధారంగా రాష్ట్ర సర్కారు ఏవైనా చర్యలు తీసుకుంటే ఏం చేయాలన్న దానిపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. క్యాబినెట్ భేటీలో ఏం చర్చిస్తారు.. కాళేశ్వరం కమిటీ నివేదిక ఆధారంగా అధికారులు ఎటువంటి వివరాలను సిద్ధం చేశారు.. దాని ఆధారంగా క్యాబినెట్ ఎటువంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై వారు సమాలోచన చేసినట్లు సమాచారం. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తో పాటు బాధ్యులందరిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని పీసీ ఘోష్ కమిషన్ సూచించినట్లయితే దాన్ని ఎదుర్కొనేందుకు ఏం చేయాలన్న దానిపై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం ఏం చేయబోతోంది.. దాన్ని ముందుగా పసిగట్టి అందుకు అనుగుణంగా న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలన్న దానిపై న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు శనివారం సమావేశమైన నేపథ్యంలో.. వారి ఆలోచనలేంటి? పార్టీ పరంగా ఏ నిర్ణయాలు తీసుకుందాం.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో స్పీక ర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అంతవరకు వేచిచూసి తదుపరి నిర్ణయం తీసుకోవాలని కేసీఆర్ పార్టీ నేతలకు సూచించినట్లు తెలిసింది.

**ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపైనా చర్చ..**

కేసీఆర్‌తో భేటీలో ఎమ్మెల్సీ కవిత అంశంపైనా పార్టీ నేతలు చర్చించినట్లు తెలిసింది. అలాగే బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు శ్రావణ మాసం కావడంతో ఫాంహౌస్‌లో చండీయాగం చేసే విషయమై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. భేటీలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

**నేడు కాళేశ్వరానికి బీఆర్ఎస్ నేతల రాక!**

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ముఖ్య నేతలు సోమవారం సందర్శించనున్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు ఆధ్వర్యంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌బాబు, సుంకె రవిశంకర్, భూపాలపల్లి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి పర్యటించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి వారు స్థితిగతులను పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. అనంతరం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మీడియాతో మాట్లాడతారని సమాచారం.

# చందానగర్ బచ్పన్ స్కూల్ లో 'కమ్యూనిటీ హెల్పర్స్ యాక్టివిటీ'



కార్యక్రమంలో వినూత్న వేషధారణతో సందడి చేస్తున్న చిన్నారులు



కార్యక్రమంలో వినూత్న వేషధారణతో సందడి చేస్తున్న చిన్నారులు

**విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలి : స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ లో గల బచ్పన్ స్కూల్ లో నిర్వహించిన కమ్యూనిటీ హెల్పర్స్ యాక్టివిటీ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులను సమాజ సేవలో భాగస్వామ్యం అయ్యే విధంగా తీర్చిదిద్దడం, తోటి వారికి సహాయం చేయాలనే ఆలోచన కలిగించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న బచ్పన్ స్కూల్ చందానగర్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందించడంతో పాటు ఎదుటివారికి ఏ విధంగా సహాయపడాలో నేర్పించినట్లు తెలిపారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు సేవా భావాలను అలవర్చుతున్నామని అన్నారు. ముఖ్యంగా వృద్ధుల పట్ల గౌరవంగా మెలగాలని, సమాజంలోని అనాధలతో ప్రేమగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ చిన్నారులు వివిధ వేషధారణతో కార్యక్రమానికి హాజరై ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో బచ్పన్ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

శంకరపట్నం, ఈ కబురు: పేదల కడుపు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలో రేషన్‌కార్డుల పంపిణీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు నాసిరకం దొడ్డు బియ్యం పంపిణీ చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా రేషన్ వ్యవస్థలో విప్లవత్మకమైన, చరిత్రాత్మకమైన మార్పును తీసుకువచ్చిందనిరు. గతంలో పంపిణీ చేసిన దొడ్డురకం బియ్యం తిరిగి ఫౌల్ట్రీ ఫాములు, రైస్ మిల్లులకు తరలిపోయేదన్నారు. గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, పాత రేషన్‌కార్డుల్లో సభ్యులను నమోదు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదనంగా 8.64లక్షల కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేసిందన్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2.81కోట్ల మందికి నాసిరకం దొడ్డు బియ్యం ఇస్తుంటే ప్రస్తుతం 3.17 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. తెలంగాణలోని 84 శాతం మందికి ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం అందజేస్తున్నామన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో 55 వేల రేషన్ కార్డులు ఉంటే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తగా 5,992 రేషన్‌కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. పాత రేషన్‌కార్డుల్లో 13,220 మందిని చేర్చామన్నారు.పేదలు, బడుగు బలహీన వర్గాలు, రైతాంగ సంక్షేమ కోసం కోసం లక్ష కోట్లు వెచ్చించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపేదల సంక్షేమమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎంత కష్టమైనా ఇచ్చిన హామీల మేరకు పథకాలను కొనసాగిస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సివిల్ సప్లయిస్ కమిషనర్ చౌహాన్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, వెలిచాల రాజేందర్‌రావు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, కొత్తగట్టు దేవస్థానం చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి పాల్గొన్నారు. మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం నూతన భవనాన్ని ఆదివారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అంతకు ముంబ్యాంకు, సింగిల్ విండో వ్యవస్థాపక అధ్యక్షులు అనభేరి వెంకటరమణరావు విగ్రహన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, సింగిల్ విండో అధ్యక్షులు అనభేరి రాధాకిషన్‌రావు. ఏఎంసీ చైర్మన్ ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.రామడుగు: ఏపీ ప్రభుత్వం గోదావరి నదిపై చట్ట వ్యతిరేకంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఆదివారం రామడుగు మండలంలోని షానగర్‌లో రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ నీటి హక్కులను హరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తోందన్నారు. మిగులు జలాలపై తెలంగాణ రాష్ట్రానికి ఉన్న వాటా ముందుగా తేలాలని అన్నారు. ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మంత్రి విమర్శించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు.

# రూ.32,000 కోట్ల పెట్టుబడి.. 14,500 కొత్త పడకలు

**కార్పొరేట్ ఆసుపత్రుల విస్తరణ బాట**

**హైదరాబాద్:** కార్పొరేట్ ఆసుపత్రులు విస్తరణ బాటలో సాగుతున్నాయి. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో కొత్తగా 14,500 పడకలు సమకూర్చుకోనున్నాయి. కొత్త ఆసుపత్రుల ఏర్పాటు, యంత్ర పరికరాల కొనుగోలు, ఇతర అవసరాల కోసం మొత్తం మీద ఇవి రూ.32,000 కోట్లు పెట్టుబడి పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. రేటింగ్ సేవల సంస్థ ఇక్రా తాజా నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. 'ఈ ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పడకల వినియోగం (ఆక్యుపెన్సీ) 6264 శాతంగా ఉండొచ్చు. ఒక్కో పడక మీద లభించే ఆదాయాల్లో 68% వృద్ధి నమోదయ్యే అవకాశం ఉంది. ఆపరేటింగ్ లాభాల శాతం 2224% కావచ్చ'ని పేర్కొంది. స్టాక్ మార్కెట్లో నమోదైన 11 కార్పొరేట్ ఆసుపత్రులు, స్టాక్‌మార్కెట్లో నమోదు కాని 2 అతి పెద్ద ఆసుపత్రుల కార్యకలాపాలు, విస్తరణ ప్రణాళికలను విశ్లేషించి, రూపొందించిన నివేదిక ప్రకారం..



**కలిసొస్తున్న అంశాలివీ..**

కార్పొరేట్ ఆసుపత్రుల రంగం ఆదాయాల్లో వృద్ధికి ఎన్నో అంశాలు వీలుకల్పిస్తున్నాయి. ఆరోగ్య బీమా సదుపాయాలు విస్తరిస్తున్నాయి. జనాభా పెరుగుతుండగా, జీవనశైలి వ్యాధుల వ్యాప్తి అధికమవుతోంది. ప్రజల ఆదాయాలతో పాటు వ్యాధులపై అవగాహన పెరుగుతున్నందున ఎక్కువ మంది చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు(ప్రివెంటివ్ హెల్త్ చెకప్) చేయించుకునే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది. ఈ అంశాల వల్ల వైద్య సేవలకు అధిక గిరాకీ లభిస్తోంది.

**రెండో అంచె నగరాలకూ..**

పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా కార్పొరేట్ ఆసుపత్రులు వైద్య పడకల సంఖ్యను పెంచుకుంటున్నాయి. కొత్త ఆసుపత్రులను పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నాయి. పెద్ద నగరాలకే పరిమితం కాకుండా రెండో నగరాలైన ఒంగోలు, నాగ్‌పుర్, లఖ్‌నవూ, కోయంబత్తూరుల్లోనూ ఆసుపత్రులను కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్నాయి. పెద్ద సంస్థలు అయితే, ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న చిన్న ఆసుపత్రులను కొనుగోలు చేస్తూ.. తమ అజమాయిషీలోని పడకల సంఖ్యను ఎంతో వేగంగా పెంచుకుంటున్నాయి. వరంగల్‌లోని ప్రశాంతి హాస్పిటల్‌ను ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ కొనుగోలు చేయడం దీనికి తాజా ఉదాహరణ. తద్వారా కార్పొరేట్ ఆసుపత్రులు తమ ఆదాయాలను పెంచుకుంటున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరానికి ఈ సంస్థల ఆర్‌ఓసీఈ (మూలధనంపై ప్రతిఫలం) 1316% ఉంటుందని ఇక్రా అంచనా వేసింది.



# రష్యన్ చమురు వదులుకుంటే భారత్‌కు 11 బిలియన్ డాలర్ల భారం

**అమెరికా సుంకాల పెంపు, జరిమానాల కారణంగా భారత్‌కు కొత్త చిక్కులు తప్పేలా లేవు. రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. శనివారం కూడా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ ఆపేస్తోందంటూ ఏకపక్ష వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సుంకాలు, ఇతర వాణిజ్య పరిణామాల దృష్ట్యా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేస్తే భారత్ ఏటా 9-11 బిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 78,000-92,000 కోట్ల) మేర నష్టాన్ని భరించాల్సి ఉంటుందని కెప్లర్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారుగా ఉన్న భారత్ 2022 నుంచి డిస్కౌంట్ లభిస్తున్న కారణంగా రష్యా నుంచి ముడిచమురు కొనుగోను గణనీయంగా పెంచింది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందు 0.2 శాతం కంటే తక్కువగా ఉన్న రష్యన్ చమురు వాటా,ఇప్పుడు 35-40 శాతానికి పెరిగింది. భారత్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయంతో ఖర్చులను తగ్గించింది. దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు వీలు కుదిరింది. అంతేకాకుండా రష్యా చమురును వద్దనుకున్న దేశాలతో సహా పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేయడం ద్వారా భారత్ రికార్డు లాభాలను సాధించింది.**

అయితే, తాజా పరిణామాలు భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా రెండు సమస్యలు.. మొదటిది అమెరికా జరిమానా ముప్పు కాగా, రెండవది రష్యా ముడి చమురు నుంచి శుద్ధి చేసిన ఉత్పత్తులను 2026, జనవరి నుంచి ఈయూ నిషేధం విధించడం. ఇవి రెండింటి ఒత్తిడి కారణంగా భారత్ ముడి చమురు కొనుగోలును తగ్గించనున్నాయి. ఫలితంగా వ్యయ భారం ముదరవచ్చని కెప్లర్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 202324లో భారత్ ముడి చమురు దిగుమతుల కోసం 137 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 12 లక్షల కోట్లు) ఖర్చు చేసింది. రష్యన్ చమురు నిలిపేసి మధ్యప్రాచ్యం, లాటిన్ అమెరికా వంటి ప్రత్యామ్నాయ మార్కెట్లతో భర్తీ చేయడం వల్ల చమురు బిల్లు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. రోజుకు 18 లక్షల బ్యారెళ్ల చొప్పున బ్యారెల్‌కు 5 డాలర్లు( రూ. 436) కోల్పోతే, భారత్ చమురు బిల్లుపై ఏటా 911 బిలియన్ డాలర్ల భారం తప్పదని కెప్లర్‌లో లీడ్ రీసెర్చ్ అనలిస్ట్ (రిఫైనింగ్ అండ్ మోడలింగ్) సుమిత్ రిటోలియా వివరించారు. సరఫరాను కఠినతరం చేయడం వల్ల ప్రపంచ చమురు ధరలు పెరిగితే, ఖర్చుల భారతం ఇంకా పెరిగే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. **

# కేంద్రమే ఆర్థిక సహకారం, క్రెడిట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్న ఎగుమతిదారులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 25 శాతం సుంకం భారాన్ని తట్టుకునేందుకు దేశంలోని వివిధ రంగాలకు చెందిన ఎగుమతిదారులు ప్రభుత్వ సాయాన్ని ఆశిస్తున్నారు. ఆహార, సముద్ర, టెక్స్‌టైల్ సహా పలు రంగాలకు చెందిన ఎగుమతిదారులు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం, సరసరమైన వడ్డీతో రుణ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. దీనికి సంబంధించి ముంబైలో వాణిజ్య, పరిశ్రాల మంత్రిత్వ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో సమావేశం అనంతరం కొందరు ఎగుమతిదారులు ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం తరహాలో నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నట్టు చెప్పారు. ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాల వల్ల అమెరికా మార్కెట్లో తమకు సమస్యలు ఉత్పన్నమవుతాయని ఓ ఎగుమతిదారు చెప్పారు. ఈ అంశంపై ఎగుమతిదారుల సంఘం సూచనలు లిఖితపూర్వకగా పంపాలని మంత్రి సూచించినట్టు తెలుస్తోంది. ప్రధానంగా తాము తక్కువ వడ్డీతో కూడైన రుణాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు డిమాండ్ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఎగుమతిదారుల ప్రకారం, సాధారంగా ఎగుమతిదారులకు 8 నుంచి 12 శాతం లేదా అంతకంటే ఎక్కువ వడ్డీ రేట్లు ఉంటాయి. ఇవి కూడా బ్యాంకులు రుణగ్రహీత వ్యాపారం, రిస్క్ అంచనాపై ఆధారపడి ఉంటుంది. కొన్ని వేరే దేశాల్లో ఈ వడ్డీ రేట్లు చాలా తక్కువగా ఉంటాయి. ఉదాహరణకు, సెంట్రల్ బ్యాంకు రేటు ఆధారంగా ఎగుమతిదారులపై చైనాలో 3.1 శాతం, మలేషియాలో 3 శాతం, థాయిలాండ్‌లో 2 శాతం, వియత్నాంలో 4.5 శాతం వడ్డీ ఉంటుంది.



మిగిలిన రంగాలతో పోలిస్తే టెక్స్‌టైల్స్, రొయ్యల వంటి రంగాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అమెరికా ఆర్డర్లను రద్దు చేయడం లేదా వెనక్కి తీసుకోవడం ఇప్పటికే ప్రారంభమైంది. రానున్న నెలల్లో ఇది మనదేశం నుంచి అమెరికాకు ఎగుమతులపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఎగుమతి రంగంలో ఉద్యోగాలు పోతాయని కొందరు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకం ఇవ్వడం కూడా కష్టమవ్వొచ్చని కొందరు భావిస్తున్నారు. భారత లెదర్, ఫ్యాషన్ ఎగుమతుల్లో అమెరికా వాటా 30 శాతానికి పైగా ఉంది.



# ఈ సీఈవో శాలరీ.. ఐటీ కంపెనీల్లోనే టాప్

ప్రముఖ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్‌టెక్ సీఈవో సి. విజయకుమార్ రికార్డు స్థాయి వేతనం అందుకున్నారు. 202425 ఆర్థిక సంవత్సరంలో ఆయన 10.85 మిలియన్ డాలర్లు (సుమారు రూ.94.6 కోట్లు) సంపాదించారు. ఇది భారతీయ ఐటీ రంగంలో ఎగ్జిక్యూటివ్‌లు పొందుతున్న అత్యధిక వేతనంగా నిలిచింది.

విజయకుమార్ వేతనం పెద్ద పోటీ సంస్థలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ ఛీఫ్‌ల సంపాదనను సైతం అధిగమించింది. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయన ప్రస్తుత వేతనాన్ని 71 శాతం పెంచి 18.6 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.154 కోట్లు) పెంచుకోవడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ వార్షిక నివేదిక తెలిపింది.

ఇదే సమయంలో టీసీఎస్ సీఈఓ కృతివాసన్ వేతనం రూ.26.52 కోట్లు కాగా, ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ వేతనం రూ.80.62 కోట్లుగా ఉంది. అలాగే విప్రో సీఈఓ శ్రీనివాస్ పలియా ఆర్జన సుమారు రూ.53.64 కోట్లు, టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి సంపాదన రూ.53.9 కోట్లుగా ఉన్నాయి.

2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో విజయకుమార్ అందుకున్న మొత్తం పరిహారంలో మూల వేతనం 1.96 మిలియన్ డాలర్లు కాగా పనితీరు ఆధారిత బోనస్ 1.73 మిలియన్ డాలర్లుగా ఉందని హెచ్‌సీఎల్‌టెక్ వార్షిక నివేదిక తెలిపింది.

ఆయన సంపాదనలో ఎక్కువ భాగం దీర్ఘకాలిక ప్రోత్సాహకాలు 6.96 మిలియన్ డాలర్ల విలువైన నియంత్రిత స్టాక్ యూనిట్లు (ఆర్ఎస్‌యూలు) నుంచే వచ్చింది. ఇవికాక బెనిఫిట్స్, పెర్క్విసైట్స్ కింద అదనంగా మరో 0.20 మిలియన్ డాలర్లు లభించాయి.

2016లో హెచ్‌సీఎల్‌టెక్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన విజయకుమార్ అమెరికాలో ఉంటూ తన రెమ్యూనరేషన్‌ను కంపెనీకి చెందిన అమెరికా అనుబంధ సంస్థ హెచ్‌సీఎల్ అమెరికా ఇంక్ నుంచి తీసుకుంటున్నారు.

# టీవీఎస్ మోటార్ విక్రయాలు పెరిగాయ్..




**చెన్నై:** టీవీఎస్ మోటార్ విక్రయాలు 2025 జూలై నెలలో మొత్తం 29 శాతం పెరిగి 4,56,350 యూనిట్లకు చేరుకున్నాయని కంపెనీ తెలిపింది. గతేడాది ఇదే జూలైలో డీలర్లకు 3,39,676 వాహనాలు సరఫరా చేసినట్లు పేర్కొంది. దేశీయంగా(భారత్‌లో) 3,08,720 వాహన అమ్మకాలు నమోదవ్వగా, 2024 జూలైలో విక్రయాలు 2,54,250 యూనిట్లగా ఉన్నాయి.ఇందులో మోటార్‌సైకిల్ విభాగ విక్రయాల వృద్ధి 25 శాతంగా ఉంది. గతేడాది జూలైలో 1,61,074 యూనిట్లుగా ఉండగా, 2025 జూలైలో 2,01,494 యూనిట్లకు చేరాయి. ఇదే జూలైలో మొత్తం 198,265 స్కూటర్లు అమ్ముడయ్యాయి. గతేడాది జూలైలో విక్రయించిన 1,39,995 యూనిట్లతో పోలిస్తే ఇవి 42% అధికంగా ఉన్నాయి. ఎలక్ట్రానిక్ వాహన(ఈవీ) విభాగం అమ్మకాల వృద్ధి 10 శాతంగా ఉంది. మొత్తం 21,442 యూనిట్ల నుంచి 23,605 యూనిట్లకు చేరింది. జూలైలో మొత్తం 1,42,629 యూనిట్లు ఎగుమతి కాగా, గతేడాది ఇదే నెలలో 97,589 యూనిట్లు విదేశాలకు తరలించారు.

# ఓటీటీలోకి రొమాంటిక్ కామెడీ మూవీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు వినోదం పంచేందుకు రొమాంటిక్ కామెడీ మూవీ సిద్ధమైంది. థియేటర్లలో తమిళ్‌లో విడుదలకాగా.. ఓటీటీలో తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీలో సందడి చేయనుంది. ఆ సినిమానే 'ఓహో ఎంథన్ బేబీ' . 'నెట్‌ఫ్లిక్స్' లో ఈ నెల 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ వివరాలు వెల్లడిస్తూ సదరు సంస్థ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. 'రొమాన్స్ ఉంది. ట్విస్టు ఉంది. డ్రామా ఉంది. హ్యాపీ ఎండింగ్ ఉందా?' అంటూ సినిమా కథాంశాలను ప్రస్తావించింది.

తొలి ప్రయత్నంలోనే రుద్ర నటుడిగా ఆకట్టుకున్నాడు. అతడి సరసన హీరోయిన్ మిథిలా పాల్కర్ నటించింది. కృష్ణకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 11న థియేటర్లలో విడుదలైంది.

కథేంటంటే?: అసిస్టెంట్ డైరెక్టర్ అశ్విన్ (రుద్ర) దర్శకుడిగా మారేందుకు ప్రయత్నాలు చేస్తుంటాడు. అందులో భాగంగా.. హీరో విష్ణు విశాల్‌ను సంప్రదించి, రెండు కథలు చెబుతాడు. అవి విష్ణుకు నచ్చవు. దీంతో మరో ప్రయత్నంగా తన ప్రేమకథనే వినిపిస్తాడు అశ్విన్. డాక్టర్ మీరా (మిథిలా పాల్కర్)తో బ్రేకప్ అయ్యే సీన్‌తో ప్రథమార్ధం ముగుస్తుంది. ఆ తర్వాత, అశ్విన్.. మీరాని కలిసేలా సినిమాని ముగించమని విష్ణు సూచిస్తాడు. అలా చేసేందుకు అశ్విన్ అంగీకరించడు. మరి, సినిమాని తెరకెక్కించేందుకు అశ్విన్‌కు విష్ణు అవకాశం ఇచ్చాడా? అశ్విన్- మీరా మళ్లీ కలిశారా? అన్నది మిగతా కథ.






## రెజాంగ్‌లా యుద్ధంలో రాశీ ఖన్నా?

'ది సబర్మతీ రిపోర్ట్', 'యోధ' లాంటి చిత్రాలతో గతేడాది మంచి విజయాన్ని అందుకుంది కథానాయిక రాశీ ఖన్నా. ఇటీవలే పవన్ కల్యాణ్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటించే అవకాశాన్ని సొంతం చేసుకుందీమె. ఇప్పుడు రాశి మరో ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ దర్శకుడు, నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం '120 బహాదుర్'. రజనీశ్ ఘాయ్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో రాశి ఓ కీలక పాత్రలో మెరవనుందట. త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. 1962లో జరిగిన ఇండో-చైనా యుద్ధంలో ముఖ్యమైనదిగా గుర్తింపు పొందిన రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ జీవితం ఆధారంగా దీన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాను ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది.



# ఎందరో తల్లులు ఫోన్ చేసి అలా చెబుతుంటే..



తమన్నా.. ఈ పేరు చెప్పగానే ఒకప్పుడు హీరోయిన్‌గా చేసిన సినిమాలు గుర్తొచ్చేవి. కానీ గత కొన్నేళ్లలో చూసుకుంటే మాత్రం ఐటమ్ సాంగ్స్ గుర్తొస్తున్నాయి. ఎందుకంటే 'కావాలయ్యా', 'ఆజ్ కీ రాత్' తదితర గీతాలతో తెగ వైరల్ అయిపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సౌత్, నార్త్‌లో ఈ తరహా సాంగ్స్ చేయడం వల్ల తనకొచ్చిన క్రేజ్ గురించి మాట్లాడింది. ఎంతోమంది పిల్లలు తన పాటలు చూస్తూ అన్నం తింటున్నారని చెప్పుకొచ్చింది.

'ఓ పిల్లాడు నా పాట చూస్తూ తింటుంటే అలానే చూడనివ్వండి' అని తమన్నా చెప్పింది. మీరు ఏ సాంగ్ గురించి మాట్లాడుతున్నారని హోస్ట్ అడగ్గా.. 'స్త్రీ 2 మూవీలో ఆజ్ కీ రాత్ గురించి' అని తమన్నా బదులిచ్చింది. అలానే 'ఎందరో తల్లులు నాకు ఫోన్ చేసి, మా బిడ్డ మీ పాట వింటూ, చూస్తే తప్పితే భోజనం చేయట్లేదు అని చెప్పారో లెక్కలేదు. పిల్లలకు నచ్చింది కనిపిస్తే అలానే చేస్తుంటారుగా' అని తన ఆనందాన్ని పంచుకుంది.

తమన్నా కామెంట్స్‌పై స్పందించిన హోస్ట్.. ఇది తల్లులు చింతించాల్సిన విషయమే అని అన్నాడు. దీనికి కౌంటర్ ఇచ్చిన తమన్నా.. 'తమ పిల్లలు సరిగా తింటున్నారా లేదా అని తల్లులు చింతించాలి. అదే వాళ్లకు ముఖ్యం. అంతే కానీ ఏ సాంగ్ వింటున్నారనేది కాదు. అయినా ఏడాది పిల్లలకు లిరిక్స్ ఏం అర్థమవుతాయి? వాళ్లు సంగీతం మాత్రమే ఎంజాయ్ చేస్తారు. కొన్నిసార్లు మనం కూడా సినిమాల్ని మర్చిపోతాం కానీ పాటలు గుర్తుంచుకుంటాగా. అలానే ఇది' అని చెప్పింది.

తమన్నా చెప్పింది నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే యూట్యూబ్‌లో మంచి బీట్ ఉన్న పాటలంటే ఎక్కువగా స్పెషల్ సాంగ్సే ఉంటాయి. వాటిని చూపిస్తూనే చాలామంది తల్లలు.. పిల్లలకు అన్నం తినిపిస్తున్నారేమో? ఇకపోతే తమన్నా కెరీర్ విషయానికొస్తే.. చివరగా తెలుగులో 'ఓదెల 2' సినిమా చేసింది. ప్రస్తుతం హిందీలో మూడు మూవీస్ చేస్తోంది. గతేడాది వరకు నటుడు విజయ్ వర్మతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగింది. కొన్నాళ్ల క్రితం వీళ్లకు బ్రేకప్ అయింది. ప్రస్తుతానికైతే తమన్నాకు సినిమాలే ప్రపంచం.

# లక్కీ ఛాన్స్ కొట్టేసిన జీవీ ప్రకాశ్ సోదరి?

సూర్య.. కొన్నాళ్ల క్రితమే 'రెట్రో'తో ప్రేక్షకుల్ని పలకరించాడు. తమిళంలో పర్లేదు గానీ తెలుగులో ఘోరమైన డిజాస్టర్ అయింది. ప్రస్తుతం 'కరుప్పు' అనే మూవీ చేస్తున్నాడు. దీనికి ఆర్జే బాలాజీ దర్శకుడు. కొన్నిరోజుల క్రితం గ్లింప్స్ రిలీజ్ చేశారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తెరకెక్కిస్తున్నారు. దీనితో పాటు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితోనూ సూర్య ఓ మూవీ చేస్తున్నాడు. ఇందులోనే ప్రముఖ సంగీత దర్శకుడి సోదరి లక్కీ ఛాన్స్ కొట్టేసినట్లు తెలుస్తోంది.

మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ సోదరి భవాని శ్రీ.. సూర్య-వెంకీ అట్లూరి మూవీలో నటించనున్నట్లు తెలుస్తోంది. భవాని శ్రీ ఇంతకుముందు పావ కథైగల్, కాపే రణసింగం సినిమాల్లో హీరోయిన్‌గా చేసింది. సూరికి జంటగా 'విడుదలై' చిత్రంలోనూ కథానాయికిగా నటించింది. తాజాగా సూర్య కథానాయకుడిగా నటిస్తున్న చిత్రంలో ఈమె పాత్ర ఏమిటి అన్నది ఆసక్తిగా మారింది. ఈ సినిమాలో సూర్య సరసన మలయాళ బ్యూటీ మమిత బైజు చేస్తోంది. మరి భవాని శ్రీ కూడా సూర్యకు హీరోయిన్ లేదా మరేదైనా పాత్ర అనేది తెలియాల్సి ఉంది. రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు ఈ చిత్రంలో ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.





# నన్ను పిలిచి లగేజ్ మోయమన్నాడు.. తీసుకెళ్లిన తర్వాతే అతనెవరో తెలిసింది: రజనీ



ఒకానొక సమయంలో తాను కూలీగా లగేజ్ మోయాల్సి వచ్చిందని, ఆ తర్వాత ఆ వ్యక్తి అన్న మాటలకు ఎంతో బాధపడ్డానని అగ్ర కథానాయకుడు రజనీకాంత్ అన్నారు. ఆయన కీలక పాత్రలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' . ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం చెన్నైలో ట్రైలర్ విడుదల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజనీకాంత్ మాట్లాడుతూ.. ఒక సందర్భంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకున్నారు.

"ఒకరోజు నేను రోడ్డుపై నిలబడి ఉంటే, ఒక వ్యక్తి నన్ను పిలిచి, 'నా లగేజ్‌ను టెంపో వరకూ తీసుకెళ్తావా' అని అడిగాడు. నేను సరేనన్నాను. అతన్ని పరిశీలించి చూస్తే, తెలిసిన వ్యక్తిలా అనిపించాడు. కొన్ని క్షణాల తర్వాత తను నేనూ ఒకే కాలేజ్‌లో చదువుకున్నామని అర్థమైంది. అప్పట్లో అతడిని నేను సరదాగా ఆటపట్టించేవాడిని. లగేజ్ టెంపో దగ్గరకు తీసుకెళ్లిన తర్వాత అతడు రూ.2 చేతిలో పెడుతూ ఒక మాట అన్నాడు. 'అప్పట్లో నీకున్న అహంకారం ఎవరికీ లేదు. నీకు ఆ రోజులు గుర్తున్నాయా?' అని అడిగాడు. నాకు కన్నీళ్లు ఆగలేదు. నా జీవితంలో ఎంతో బాధపడిన సందర్భమది" అని రజనీకాంత్ గుర్తు చేసుకున్నారు.

అనంతరం 'కూలీ' దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌ను రియల్ హీరో అంటూ అభినందించారు. "'కూలీ' సినిమాకు సంబంధించి రియల్ హీరో లోకేశ్ కనగరాజ్. ఈ మూవీపై అంచనాలను పతాకస్థాయికి తీసుకెళ్లారు. ఒక విజయవంతమైన కమర్షియల్ దర్శకుడితో పనిచేయడం ఆనందంగా ఉంది. ఇందులో నటీనటులతో ఒక తుపాను సృష్టించాడు. లోకేశ్ ఈ కథ చెప్పడానికి నా దగ్గరకు వచ్చినప్పుడు మాట్లాడుతూ.. 'నేను కమల్ ఫ్యాన్ సర్' అన్నాడు. 'నేను నిన్ను అడిగానా' అని అన్నాను. 'లేదు సర్. మామూలుగా చెప్పాను' అన్నాడు. 'ఈ స్టోరీలో పంచ్ డైలాగ్‌లు ఉండవు' అని ముందే చెప్పాడు. అప్పుడే అర్థమైంది ఇదొక ఇంటెన్సిటీ డ్రామా" అని రజనీకాంత్ అన్నారు.

ఇందులో కీలక పాత్ర పోషించిన ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ.. 'లోకేశ్ నన్ను కలిసినప్పుడు ఈ కథ, రిలీజ్ డేట్ గురించి ఆయన్ను అడగలేదు. ఎందుకంటే ఇది రజనీసర్ ఫిల్మ్. అంతకుమించిన అంశం ఇంకేముంటుంది. నేను లోకేశ్‌ను అడిగింది ఒక్కటే.. 'షూటింగ్ ఎప్పుడు మొదలు పెడుతున్నాం'' అని చెప్పుకొచ్చారు. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, శ్రుతిహాసన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, మహేంద్రన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించారు. తాజాగా విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచేసింది. 'కూలీ'తో లోకేశ్ మరో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాడంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.




## వీడని సస్పెన్స్... ఆగిన మ్యాచ్

ఆండర్సన్‌టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లండ్, భారత్ మధ్య చివరి టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఓవల్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో నాలుగవ రోజు ఆటను వెలుతురు లేని కారణంగా నిలిపివేశారు. బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లండ్ 6 వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేసింది. మ్యాచ్ గెలవాలంటే ఇంగ్లండ్ మరో 35 పరుగులు చేయాలి. ప్రస్తుతం క్రీజులో ఓవర్టన్(0), స్మిత్(2) ఉన్నారు. భారత్ గెలవాలంటే మరో 3 వికెట్లు తీయాల్సి ఉంది. ఐదు టెస్ట్ మ్యాచులు ఈ సిరీస్ లో ఇంగ్లండ్ ఇప్పటికే 21 తో ముందంజలో ఉండగా.. సిరీస్ సమం చేయాలంటే భారత్ ఈ మ్యాచ్ తప్పక గెలవాలి. అయితే వర్షం కారణంగా నాలుగవ రోజు ఆట రద్దు చేయబడింది.



# ఫలితం తేలేది ఆఖరి రోజే.. నాలుగో రోజు ముగిసిన ఆట.. ఇంగ్లాండ్ 339/6





**లండన్:** ఇంగ్లాండ్, భారత్ మధ్య టెస్టు సిరీస్ రసవత్తర ముగింపు ముంగిట నిలిచింది. సిరీస్ ఫలితం ఐదో రోజైన సోమవారం తేలనుంది. 374 పరుగుల లక్ష్యఛేదనలో 50/1తో నాలుగో రోజు ఆటను మొదలుపెట్టిన ఇంగ్లాండ్.. ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 35 పరుగులు అవసరం. జేమీ ఒవర్టన్ (0*), జేమీ స్మిత్ (2*) క్రీజులో ఉన్నారు. వర్షం కారణంగా ఆటను ముందుగానే నిలిపివేశారు. హ్యారీ బ్రూక్ (111; 98 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్సలు), జో రూట్ (105; 152 బంతుల్లో 12 ఫోర్లు) శతకాలు బాదారు. బెన్ డకెట్ (54; 83 బంతుల్లో 5 ఫోర్లు) హాఫ్ సెంచరీ చేశాడు. ఓలీ పోప్ (27; 34 బంతుల్లో 5 ఫోర్లు), జాక్ క్రాలీ (14; 36 బంతుల్లో) పరుగులు చేశారు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 3, మహ్మద్ సిరాజ్ 2, ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టారు.

**హారీ బ్రూక్ మెరుపు సెంచరీ..**

**ఓటమి అంచున భారత్**

కెన్సింగ్టన్ ఓవల్ వేదికగా జరుగుతున్న భారత్, ఇంగ్లాండ్ ఐదో టెస్ట్ మ్యాచ్ ఉత్కంఠగా కొనసాగుతోంది. చివరి టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజు ఇంగ్లాండ్ బ్యాటర్లు పట్టు సాధించి నిలకడగా రాణిస్తున్నారు. జో రూట్ 79 పరుగులతో క్రీజులో ఉండగా.. హారీ బ్రూక్ .. మెరుపు వేగంతో బ్యాటింగ్ చేస్తూ.. భారత బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. మొదటి సెషన్ వరకు నెమ్మదిగా ఆడిన బ్రూక్ లంచ్ బ్రేక్ తర్వాత.. వేగం పెంచాడు. ప్రతి ఓవర్లో కచ్చితంగా బౌండరీ సాధిస్తూ ముందుకు సాగుతున్నాడు. ఈ క్రమంలోనే బ్రూక్ 91 బంతుల్లో 2 సిక్సర్లు 11 ఫోర్లతో సెంచరీ నమోదు చేసుకున్నాడు. దీంతో భారత్ ప్రస్తుతం ఓటమి అంచున కొనసాగుతోంది. ఇప్పటి వరకు 62 ఓవర్లలో ఇంగ్లాండ్ జట్టు 3 వికెట్లు కోల్పోయి 293 పరుగులు చేసింది. విజయానికి ఇంగ్లాండ్ జట్టుకు మరో 81 పరుగులు అవసరం ఉండగా భారత జట్టుకు 7 వికెట్లు కావాలి. మరి ఈ మ్యాచ్ లో ఎవరు విజయం సాదిస్తారో తెలియాలంటే వేచి చూడాల్సిందే.





# చరిత్ర సృష్టించిన భారత్-ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్

**భారత్-ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న టెండూల్కర్-ఆండర్సన్ టెస్ట్ సిరీస్ రికార్డుపుటల్లోకెక్కింది. ఈ సిరీస్‌లో ఇరు జట్లకు చెందిన ఆటగాళ్లు ఏకంగా 50 అర్ధ సెంచరీలు బాదారు. టెస్ట్ క్రికెట్ ఆరంభం నుంచి ఓ సిరీస్‌లో అత్యధిక హాఫ్ సెంచరీల సంఖ్య ఇదే. 1993 యాషెస్ సిరీస్‌లోనూ ఇన్నే హాఫ్ సెంచరీలు నమోదయ్యాయి.**

తాజాగా టెండూల్కర్‌ఆండర్సన్ ట్రోఫీ ఆల్‌టైమ్ రికార్డును సమం చేసింది. ఐదో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ చేసిన హాఫ్ సెంచరీ ఈ సిరీస్‌లో 50వది.

టెస్ట్ సిరీస్‌లో అత్యధిక వ్యక్తిగత 50+ స్కోర్లు
50* ఇంగ్లండ్‌లో టీమిండియా, 2025
50 ది యాషెస్, 1993
49 ది యాషెస్, 1920/21
46 ఆస్ట్రేలియాలో వెస్టిండీస్, 1960/61
46 ఆస్ట్రేలియాలో వెస్టిండీస్ 1968/69

మ్యాచ్ విషయానికొస్తే.. 374 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ గెలుపు దిశగా సాగుతోంది. నాలుగో రోజు రెండో సెషన్ డ్రింక్స్ విరామ సమయానికి ఇంగ్లండ్ లక్ష్యానికి ఇంకా 128 పరుగుల దూరంలో మాత్రమే ఉంది. ఆ జట్టు స్కోర్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 246/3గా ఉంది. క్రాలే (14), డకెట్ (54), ఓలీ పోప్ (27) ఔట్ కాగా.. జో రూట్ (59), బ్రూక్ (82) క్రీజ్‌లో ఉన్నారు. భారత బౌలర్లలో సిరాజ్ 2, ప్రసిద్ద్ కృష్ణ ఓ వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపుకు కేవలం 6 వికెట్లు (గాయం కారణంగా వోక్స్ మ్యాచ్ నుంచి వైదొలిగాడు) కావాలి.

అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (118) సెంచరీతో కదంతొక్కగా.. ఆకాశ్‌దీప్ (66), రవీంద్ర జడేజా (53), వాషింగ్టన్ సుందర్ (53) అర్ధ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్ 5 వికెట్లు తీశాడు.

దీనికి ముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌటైంది. జాక్ క్రాలే (64), హ్యారీ బ్రూక్ (53) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో సిరాజ్, ప్రసిద్ద్ కృష్ణ తలో 4 వికెట్లు తీశారు.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకే ఆలౌటైంది. భారత ఇన్నింగ్స్‌లో కరుణ్ నాయర్ (57) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అట్కిన్సన్ 5 వికెట్లతో చెలరేగాడు. ఐదు మ్యాచ్‌ల ఈ టెస్ట్ సిరీస్‌లో భారత్ 12తో వెనుకపడి ఉంది.




## ఆ టోర్నీలో ఇక పాల్గొనం.. పాక్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం

భవిష్యత్తులో వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్(డబ్ల్యూసీఎల్) టోర్నీలో పాల్గొనబోమని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ప్రకటించింది. టోర్నీలో తమ ప్లేయర్లు పాల్గొనకుండా నిషేధం విధించింది. ఆదివారం జరిగిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మీటింగ్‌లో పీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్‌తో భారత మాజీ క్రికెటర్లు మ్యాచ్‌లు ఆడేందుకు నిరాకరించడంతో డబ్ల్యూపీఎల్ చర్చనీయాంశమైంది. డబ్ల్యూపీఎల్ నిర్వాహకులపై పీసీబీ ఆరోపణలు చేసింది. క్రీడా సూత్రాలను విస్మరించి, పక్షపాత వైఖరిని అవలంభించినట్టు ఆరోపించింది. గ్రూపు దశ మ్యాచ్ నుంచి ఉద్దేశపూర్వకంగానే భారత్ చాంపియన్స్ తప్పుకుందని, అలాంటప్పుడు ఆ జట్టుకు పాయింట్ ఇవ్వడాన్ని పీసీబీ తప్పుబట్టింది. ఇది నిరాశకు గురి చేసిందని చెప్పింది. నిష్పాక్షిక పరిపాలన, ప్రాథమిక సూత్రాల విషయంలో రాజీపడే ఈ టోర్నీలో పీసీబీ కొనసాగలేదని తెలిపింది. పాకిస్తాన్ పేరును ప్రైవేట్ లీగ్‌స్‌లో వాడేందుకు అనుమతిని రద్దు చేసిన విషయం తెలిసిందే. కాగా, సెమీస్ నుంచి భారత్ తప్పుకోవడంతో పాకిస్తాన్ నేరుగా ఫైనల్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. అయితే, టైటిల్ పోరులో సౌతాఫ్రికా చాంపియన్స్ చేతిలో చిత్తుగా ఓడింది.

# విధ్వంసకర శతకంతో విరుచుకుపడిన భారత యువ కెరటం

**ఇటీవలికాలంలో భారత అండర్-19 క్రికెట్ హీరోలు చెలరేగిపోతున్నారు. వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మాత్రే లాంటి వారు ఇటీవల ఇంగ్లండ్ గడ్డపై ఆకాశమే హద్దుగా చెలరేగగా.. తాజాగా ఢిల్లీ ప్రీమియర్ లీగ్-2025లో భారత అండర్-19 జట్టు మాజీ సారథి యశ్ ధుల్ విధ్వంసకర శతకంతో విరుచుకుపడ్డాడు.**



డీపీఎల్ 2025 రెండో మ్యాచ్‌లో ధుల్ సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌కు ఆడుతూ నార్త్రన్ ఢిల్లీ స్ట్రయికర్స్‌పై 56 బంతుల్లో 8 ఫోర్లు, 7 భారీ సిక్సర్ల సాయంతో అజేయమైన 101 పరుగులు చేశాడు. ఫలితంగా సెంట్రల్ ఢిల్లీ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ప్రస్తుత డీపీఎల్ సీజన్‌లో ధుల్ సెంచరీనే మొదటిది. గత సీజన్ మొత్తంలో 93 పరుగులే చేసిన ధుల్ ఈ సీజన్ తొలి మ్యాచ్‌లోనే సెంచరీతో మెరిశాడు. రెడ్ బాల్ బ్యాటర్‌గా ముద్రపడిన ధుల్ ఈ ఇన్నింగ్స్‌తో ఆ ముద్రను చెరిపేసి ఆల్ ఫార్మాట్ బ్యాటర్ అనిపించుకున్నాడు.

అండర్19 క్రికెట్ ప్రదర్శనల ఆధారంగా 2023 ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున అరంగేట్రం చేసిన ధుల్.. ఆ సీజన్‌లో దారుణంగా విఫలమయ్యాడు. 3 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 16 పరుగులే చేశాడు. ఆ సీజన్‌లో పేలవ ప్రదర్శన తర్వాత ధుల్‌ను ఏ ఐపీఎల్ ఫ్రాంచైజీ పట్టించుకోలేదు. తాజాగా ప్రదర్శనతో ఢిల్లీ క్యాపిటల్స్ ధుల్‌ను మరోసారి దక్కించుకునే ప్రయత్నం చేయవచ్చు.

మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తర ఢిల్లీ.. సర్తక్ రంజన్ (82), అర్నవ్ బుగ్గా (67) అర్ధ సెంచరీలతో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. సెంట్రల్ ఢిల్లీ బౌలర్లలో గవిన్ష్ ఖురానా, మనీ గ్రేవాల్ తలో 2 వికెట్లు తీయగా.. సిమర్‌జీత్ సింగ్, తేజస్ బరోకా తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన సెంట్రల్ ఢిల్లీ.. ఓపెనర్ యశ్ ధుల్ విధ్వంసకర శతకంతో విరుచుకుపడటంతో 17.3 ఓవర్లలోనే విజయతీరాలకు చేరింది (2 వికెట్లు కోల్పోయి). సెంట్రల్ ఢిల్లీని విజయతీరాలకు చేర్చడంలో ధుల్‌కు యుగల్ సైనీ (36), జాంటి సిద్ధూ (23 నాటౌట్) సహకరించారు. ఉత్తర ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు తీశాడు.